క్లుప్తంగా

నేడు 'రైతు నేస్తం'

బంట్వారం: బుగ్గాపూర్ రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని కోట్‌పల్లి వ్యవసాయ విస్తరణ అధికారి సందీప్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులకు వాతావరణ ఆధారిత సూచనలను శాస్త్రవేత్తలు అందిస్తారన్నారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ఈ కాన్ఫరెన్స్‌కు రైతులందరూ సకాలంలో హాజరు కావాలని సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం సభ్యులు

కొడంగల్: మండల పరిధిలోని హస్నాబాద్‌పూర్ గ్రామాన్ని నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం సభ్యులు జోసెఫ్, వినోద్ సోమవారం పరిశీలించారు. గ్రామంలో పూర్తయిన, చేపట్టిన పనులను తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్లు, తెలంగాణా క్రీడా ప్రాంగణం, పశువుల షెడ్లు, ఉపాధి హామీ పథకంలో భూమిని చదును చేసే పనిని పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సరళ, ఎంపీడీఓ ఉషశ్రీ, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, ఏపీఓ రాములు, పీఆర్ ఏఈ రవికిరణ్, డీఆర్‌డీఏ వికారాబాద్ ఈసీ సైదులు, ఏపీఎం వెంకన్న, పంచాయతీ కార్యదర్శి కొండన్న పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన శుభప్రద్‌పటేల్



కేటీఆర్‌తో శుభప్రద్ పటేల్

అనంతగిరి: బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రదపటేల్ సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిశోర్, నయీం, సిద్దిఖీ, రాము, అబేద్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ మరమ్మతులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కేశంపేట: మండల కేంద్రంలో రూ.25లక్షల నిధులతో విద్యుత్ మరమ్మతులు సోమవారం ప్రారంభమయ్యాయి. గ్రామ మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొని పనులను ప్రారంభించారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, సురేష్ రెడ్డి, తహసీల్దార్ అజాంఅలీ, ఏడీ రవీందర్, విద్యుత్ ఏఈ ఈశ్వర్, కాంట్రాక్టర్ మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్ సునీతకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

షాద్‌నగర్: కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పట్టణంలోని సాయిబాబా ఫేస్–2, అరుణోదయ కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ సునీతకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తాము ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలను తాము ఏర్పాటు చేసుకున్నామని, వీధి దీపాలు బిగించాలని కోరారు. వీధి దీపాలు లేపోవడంతో రాత్రి వేళల్లో పూర్తిగా అంధకారంలో ఉండాల్సి వస్తుందని ఆరోపించారు. అదేవిధంగా కాలనీలో సీసీరోడ్లు నిర్మించాలని కోరారు. వర్షాలు కురిస్తే మట్టిరోడ్లు పూర్తిగా బురదమయంగా మారుతున్నాయన్నారు. అదేవిధంగా మురుగు నీరు వెళ్లేందుకు డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు కటిక శ్రీనివాస్, శ్రీకాంత్, మల్లికార్జున్‌రెడ్డి, పాండు, రాజేష్ తదితరులు ఉన్నారు.

అన్నదాత.. అశ్రద్ధ వద్దు

- రసాయన మందుల పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి
- గడ్డిమందుతో మరింత అప్రమత్తత అవసరం
- మోతాదుకు మించితే పంట దిగుబడిపై ప్రభావం

దుద్యాల్: అన్ని రంగాల్లో ఆధునిక టెక్నాలజీ పెరుగుతోంది. రైతులు సైతం ఆధునిక పద్ధతుల్లో పంటల సాగుకు అలవాటుపడ్డారు. దీంతో పంటలకు రసాయనిక పురుగు మందుల వినియోగం అమాంతం పెరిగింది. విత్తనాలు విత్తిన నాటి నుంచి పంట కోతకు వచ్చే వరకు ఏదో ఒక రకంగా రసాయనిక మందులు, గడ్డి మందులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. రసాయన, కలుపు నివారణ మందుల వాడకంపై తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. లేదంటే పంటల దిగుబడిపై ప్రభావం చూపడంతో పాటు రైతు నష్టాల బారిన పడాల్సి వస్తుందంటున్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండా వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు మేరకే వినియోగించాలని సూచిస్తున్నారు.



ఆలేడ్‌లో జాగ్రత్తలు పాటిస్తూ కలుపు మందు పిచికారీ చేస్తున్న రైతు(ఫైల్)

జాగ్రత్తలు

- ▲ గాలికి ఎదురుగా రసాయన మందులు పిచికారీ చేయొద్దు.
- ▲ తెగులు, పురుగు మందు కలిపి పిచికారీ నిషిద్ధం.
- ▲ పిచికారీ సమయంలో చేతులకు గ్లౌజులు, మూతికి, ముక్కుకు మాస్కు ధరించాలి.
- ▲ పిచికారీ సమయంలో కళ్లు, ముక్కు, నోరును చేతులతో రుద్దడం, తాకడం వంటివి చేయరాదు.
- ▲ వాడిన పురుగు మందు డబ్బాలను ఎక్కడపడితే అక్కడ వేయరాదు.

మోతాదుకు మించొద్దు



ప్రతీ గ్రామంలో ఏఈఓలు అందుబాటులో ఉంటారు. వారి సూచనల మేరకు తగిన మోతాదులో పంటలకు మందులు ఉదయం పిచికారీ చేసుకోవాలి. కలుపు మందు కొట్టిన తర్వాత పురుగు మందు కొట్టరాదు. మొక్కల పైభాగంతో పాటు కింద భాగం తడిసిపోయేలా పిచికారీ చేస్తే ఆకు కింద ఉన్న రసం పీల్చు పురుగులు నశిస్తాయి. పిచికారీ సమయంలో ఇబ్బంది అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– రాజారత్నం, జిల్లా వ్యవసాయ అధికారి

- ▲ రసాయన మందులు పిచికారీ సమయంలో స్ప్రేయర్లకు లీకేజీ ఉండకుండా చూసుకోవాలి.
- ▲ పిచికారి సమయంలో బీడీలు, సిగరెట్లు త్రాగరాదు, గుట్కాలు నములరాదు.
- ▲ భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రపరుచుకోవాలి.
- ▲ కడుపులో మంట, దద్దుర్లు వస్తే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలి. లేదంటే ప్రమాదం.

ఆరోపణలు చేస్తే ఊరుకోం



చింతలపల్లి వరకు వేసిన బీటీ రోడ్డు వద్ద మాట్లాడుతున్న నాయకులు

డీసీసీ ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి

పూడూరు: ప్రభుత్వం ఒక్కొక్కటిగా అభివృద్ధి పనులు చేపడుతుంటే ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలు చేయడం తగదని డీసీసీ ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం లాల్‌పహాడ్–అంగడిచిట్టంపల్లి రోడ్డు పనులను విస్మరిస్తే ఏడాదిన్నర కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం లాల్‌పహాడ్–కంకల్ వరకు డబుల్‌రోడ్డు పనులు పూర్తి చేసిందన్నారు. చింతలపల్లి రోడ్డు పనులు జరుగుతున్నా ప్రతిపక్షాలకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కంకల్ నుంచి అంగడిచిట్టంపల్లి రోడ్డు వరకు డబుల్ రోడ్డు కోసం రూ.40 కోట్లతో ప్రతిపాదనలు పంపామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, అజీంపటేల్, నాయకులు ప్రభాకర్, జైపాల్‌రెడ్డి, రవి, వెంకటేశ్, శ్రీకాంత్, అన్వర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్

షాద్‌నగర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మంచి పౌష్టిక విలువతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. ఇటీవల ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలలు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారన్నారన్నారు. ఆహార భద్రత ప్రమాణాలు సరిగా పాటించకపోవడంతో ఫుడ్‌పాయిజన్ అవుతోందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆదిల్, కయ్యూం, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ నాయకులు

ఊరూరా బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు



కార్యకర్తలతో సమావేశమైన నర్మద

కొడంగల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ మహిళా నాయకురాలు నర్మదా కిష్టప్ప ఆదివారం రాత్రి మండల పరిధిలోని ధర్మాపూర్‌లో సమావేశం నిర్వహించారు. గ్రామంలోని బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను కలిశారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు, కార్యకర్తలు నర్మదా కిష్టప్పను ఘనంగా సన్మానించారు. కార్యకర్తలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ తెలంగాణా సాధించిన బీఆర్ఎస్‌ను తిరిగి అధికారంలోకి తేవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా అధికంగా వాడితే నష్టమే



యూరియాకు పర్మిట్లు రాస్తున్న అధికారులు

మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి

కొందుర్గు: పంటలకు యూరియాను తక్కువ మోతాదులో వాడాలని, అధికంగా వాడితే పంటలకు నష్టమేనని మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి తెలిపారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కొందుర్గులో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు నాలుగు బస్తాల వరకు అందించారు. 100 మంది రైతులకు గాను 25 టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియాను అధికంగా వాడటంతో పంటలు అధికంగా పెరగడంతో పాటు చీడపీడల బారిన పడుతాయని తెలిపారు. పచ్చిరొట్ట సాగుచేసిన పొలాల్లో మరీ తక్కువగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రమణ, పీఏసీఎస్ సిబ్బంది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నాటు తుపాకీ, కత్తులతో సంచారం

పోలీసులను తోసేసి పరారైన దుండగులు

పరిగి: ఓ సంచిలో నాటు తుపాకీ, కత్తులు, స్క్రూ డ్రైవర్లు పెట్టుకుని బైక్‌పై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను తోసేసి పరారైన ఘటన వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పరిగిలోని సుల్తాన్‌పూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేస్తున్న పోలీసులు.. కర్ణాటకకు చెందిన ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురిని ఆపారు. వీరిని తనిఖీ చేస్తుండగా సంచిలో తుపాకీ, కత్తులు కనిపించాయి. దీంతో పోలీసులను తోసేసిన దుండగులు బైక్ వదిలేసి పారిపోయారు. మారణాయుధాలు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

సమాజంపై అవగాహన అవసరం

కుల్కచర్ల ఎస్ఐ రమేశ్

కుల్కచర్ల: విద్యార్థులు సమాజంలోని మంచి, చెడులపై అవగాహన పెంపొందించుకోవాలని కుల్కచర్ల ఎస్ఐ రమేశ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్‌లో పోలీసు కళాజాత ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలు, రోడ్డు భద్రత, డ్రంక్ అండ్ డ్రైవ్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు, మహిళలపై జరుగుతున్న ఘోరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పోలీసు చట్టాలు, చట్టవ్యతిరేఖ చర్యలకు పాల్పడితే గురయ్యే శిక్షల గురించి చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మోడల్ స్కూల్ సిబ్బంది, పోలీసు కళాజాత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తాచాటుదాం

ఎలక్షన్ ఇన్‌చార్జిల నియామకంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్

ధారూరు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీజేపీ సోమవారం మండల ఇన్‌చార్జిలను నియమించింది. జెడ్పీటీసీ మండల ఎన్నికల ఇన్‌చార్జిగా రుద్రారం గ్రామానికి చెందిన సీహెచ్ వెంకటయ్యను, ఎంపీటీసీల ఎన్నికల ఇన్‌చార్జిగా అంతారం గ్రామానికి చెందిన నరేందర్‌రెడ్డిని నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించాయి. పార్టీ అభ్యర్థులను గెలిపి బీజేపీ సత్తా చాటాలనీ జిల్లా అధ్యక్షుడు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజునాయక్, జిల్లా దిశ కమిటీ సభ్యులు వడ్ల నందు, బీజేపీ నాయకులు పాండుగౌడ్, వివేకానందరెడ్డి, రమేశ్, రాజేందర్‌గౌడ్, గోపాల్, రవీందర్‌గౌడ్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన ఇన్‌చార్జి వెంకటయ్యతో రాజశేఖర్, వడ్ల నందు తదితరులు

లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవాలి



కోకట్‌లో నిర్వహించిన శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారులు

పీహెచ్‌సీ వైద్యాధికారి రుబియా నాజ్

యాలాల: రెండు వారాల పాటు దగ్గుతో ఇబ్బంది పడేవారు వెంటనే టీబీ పరీక్షలు చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రుబియా నాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కోకట్ గ్రామంలో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాయంత్రం జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, ఛాతిలో నొప్పి తదితర లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. పాజిటివ్ వచ్చిన వారికి ఆరు నెలల పాటు ఉచితంగా మందులతో పాటు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం ప్రతీ నెల రూ.వెయ్యి రోగి ఖాతాలో జమ చేస్తుందన్నారు. గ్రామంలోని 106 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, 36 మంది సాంపిళ్లను సేకరించి 18 మందికి ఎక్స్‌రే తీసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ తుల్జారాం, వైష్ణవి, పీహెచ్ఎన్ విజయసుశీల, ఏఎన్ఎంలు నర్సమ్మ, కవిత, టీబీ సూపర్‌వైజర్ రహత్ తదితరులు ఉన్నారు.

అవసరాలకు అనుగుణంగా మరమ్మతులు

ఎంపీడీఓ విజయలక్ష్మి

మోమిన్‌పేట: విద్యార్థినులకు అవసరాలకనుగుణంగా పాఠశాల భవన మరమ్మతులు చేపట్టాల్సి ఉందని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె మండల పరిధిలోని కేజీబీవీని ఎంఈఓ మల్లేశం, ఏఈఈ పీఆర్ ప్రణీత్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరుగుదొడ్లు, వంట గది, డైనింగ్ హాల్, మురుగు వెళ్లే కాల్వ, తాగు నీటి సమస్యను పరిష్కారం, అదనపు గదుల ఏర్పాటుకు తగిన అంచనాలను సిద్ధం చేయాల్సి ఉందన్నారు. ఈ అంచనాలను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు. కిచన్‌ను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. భోజనం వేడిగా వడ్డించాలని చెప్పారు. మెనూ తప్పక పాటించాలని సూచించారు.



మోమిన్‌పేట కేజీబీవీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ తదితరులు

మండల అభివృద్ధిపై నేడు రౌండ్ టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న నాయకులు

కుల్కచర్ల: మండలాభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై మండల పరిధిలోని రాజకీయ నాయకులు, యువజ, విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో మంగళవారం మండల కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పరిగి నియోజకవర్గ పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విజయచంద్ర ఫంక్షన్ హాల్‌లో ఈ సమావేశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు భాస్కర్, ఆంజనేయులు, నర్సింలు, చంద్రయ్య, నర్సింహ నాయక్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించకుంటే రద్దవుతాయి

- లబ్ధిదారులు పనుల్లో వేగం పెంచాలి
- డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగిరం చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా భీంరెడ్డి మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైన లబ్ధి/ దారులు ఆగస్టు 15 వరకు నిర్మాణాలను ప్రారంభించకుంటే రద్దవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటయ్య, కృష్ణారెడ్డి, కృష్ణయ్య, ఎల్లయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్: లగచర్లలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న నాయకులు

విడతలవారీగా బిల్లులు

బంట్వారం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని కోట్‌పల్లి ఎంపీడీఓ డానియల్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఇందోల్ గ్రామంలో అయన ఇంటి నిర్మాణానికి ముగ్గు వేసి లబ్ధిదారుకు మంజూరు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. త్వరితగతిన పనులు పూర్తి చేస్తే విడతల వారీగా బిల్లులు వస్తాయన్నారు. కోట్‌పల్లి మండలానికి 296 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. వీటిలో వంద ఇళ్లకు మార్కింగ్ చేయడం జరిగిందన్నారు. 15 ఇళ్లు బేస్మెంట్ స్థాయిలో ఉన్నాయన్నారు. నలుగురు లబ్ధిదారులకు మొదటి విడత బిల్లులు త్వరలోనే అందుతాయన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులంతా పనులు ప్రారంభించుకోవాలని సూచించారు. బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సురేందర్‌రెడ్డి, హౌజింగ్ ఏఈ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా పాలన

దుద్యాల్: పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎ.శేఖర్ అన్నారు. సోమవారం ఆయన పార్టీ లగచర్ల గ్రామాధ్యక్షుడు లక్ష్మయ్యతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతపదేళ్లలో పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ చేసిందేమీ లేదన్నారు. గ్రామంలో 53 మందికి ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బాబు, వెంకట్రాములు గౌడ్, అనంతయ్య, రవీందర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని పరిగి ఏఎంసీ వైస్ చైర్మన్ ఆయూబ్ అన్నారు. సోమవారం ఆయన పట్టణ కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయూబ్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, ఎ–బ్లాక్ అధ్యక్షుడు పార్థసారథి, నాయకులు చిన్న నర్సింలు, ఆంజనేయులు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు



బంట్వారం: లబ్ధిదారుకు మంజూరుపత్రం అందజేస్తున్న ఎంపీడీఓ డానియల్



పరిగి: ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు